క్లుప్తంగా

అంతర్జాతీయ సైకిల్ దినోత్సవ ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారి జ్యోతి

మహబూబాబాద్ అర్బన్: ఫిట్ ఇండియాలో భాగంగా జూన్2 అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సైకిల్‌పై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఓ.జ్యోతి, బాస్కెట్ బాల్ కోచ్ కుమారస్వామి, తైక్వాండో కోచ్ రాంబాబునాయక్ పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ అవార్డు అందుకున్న ధనిష్ట



గూడూరు: గూడూరు మండల కేంద్రానికి చెందిన బత్తుల ధనిష్ట అనే యువకుడు, హైదరాబాద్ ఫిలిం చాంబర్‌లో శనివారం మే 31న సూపర్‌స్టార్ కృష్ణ జన్మదినం సందర్భంగా ఆయన పేరుపై విశిష్ట సేవలు అందించినందుకు గాను, పద్మాలయ సంస్థ అందించే సూపర్‌స్టార్ కృష్ణ అవార్డును ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు.

కవి పరమేశ్వర్‌కు సన్మానం

పెద్దవంగర: హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు శిరోమణి, నాట్యమయూరి, కళారత్న సేవా ప్రతిభ అవార్డుల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈవేడుకల్లో మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న కవి, రచయిత బిర్రు పరమేశ్వర్‌ను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శిరీషరెడ్డి, సినీనటుడు పృథ్వీరాజ్ శాలువాలతో సన్మానించి ప్రశంసపత్రం, జ్ఞాపికను అందజేశారు. కవి, రచయిత పరమేశ్వర్ కార్యక్రమంలో 'లక్ష్యాన్ని వదలకు' అనే శీర్షికపై చేసిన కవిత గానంను అభినందిస్తూ పురస్కారాన్ని అందజేశారు.


చర్య తీసుకోవాలి

కురవి: ఉపాధి కూలీలకు మస్టర్లు వేయకుండా, డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం మండల మహాసభ నర్సింగం గుర్వయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీన తొర్రూరులో సంఘం జిల్లా మహాసభలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేశ్ పాల్గొన్నారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్సింగం గుర్వయ్య, ప్రధాన కార్యదర్శిగా బసవ కొమురయ్యతోపాటు మరో 12 మందిని ఎన్నుకున్నారు.

సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

మహబూబాబాద్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి కోరారు. మండలంలోని ముడుపుగల్ గ్రామంలో పార్టీ 16వ గ్రామ మహాసభను పోలగాని శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. అజయ్ సారథిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తు ప్రజాక్షేత్రంలో ఉంటున్న వారిని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్, కట్లోజు పాండురంగచారి, పెరుగు కుమార్, బానోత్ లింగ్యనాయక్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మరిపెడ: మరిపెడ మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ సీతారాంపురం రెహమానియ మసీద్ ఆవరణంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలీ, హాజీ జహంగీర్ ఆధ్వర్యంలో మరిపెడ మండల రాజ్యాంగ పరిరక్షణ వేదిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు సయ్యద్ సర్వర్, మహమ్మద్ ఫైజ్ ఖాన్ సమక్షంలో మండల అధ్యక్షుడు అఫ్సర్ (ఫుట్స్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పఠాన్ మక్బుల్ ఖాన్, కార్యదర్శిగా మహమ్మద్ భాషిత్ ఖాన్, సహాయ కార్యదర్శిగా షేక్ యాకుబ్ పాషా, కోశాధికారిగా షేక్ మున్ని, కార్యవర్గ సభ్యులుగా షేక్ అక్బర్, షాబుద్దీన్, శంషుద్దీన్, జాకీర్ హుస్సేన్, అహ్మద్, షేక్ హుస్సేన్, అక్బర్, పెంట్ సాబ్, ఖాజా, యాకుబ్ పాషా ఎన్నికయ్యారు.

ముంచుకొస్తున్న ఖరీఫ్

- రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల పంపిణీ లేదు
- ప్రభుత్వం నుంచి కానరాని రైతు చేయూత


దుక్కి దున్నుతున్న రైతు

గార్ల: పల్లెసీమలే దేశానికి పట్టుకొమ్మలని, రైతే రాజని, అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రచారం చేస్తున్న పాలకులు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా, రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర వ్యవసాయశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఏడాది ఖరీఫ్‌కు రైతులను చైతన్య పరిచేందుకు మే నెలలో ప్రతీ గ్రామంలో వివిధ రకాల పంటల సాగు వివరాలను తెలిపేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో రైతు చైతన్య యాత్రలు చేపట్టేది. కేసీఆర్ ప్రభుత్వం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రైతు చైతన్యయాత్రలు చేపట్టకపోవడంతో రైతులు పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. చిన్న సన్నకారు రైతులకు రాయితీపై పత్తి, మిర్చి, వరి విత్తనాలు, యంత్రలక్ష్మి పథకం ద్వారా వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందించి ప్రోత్సహించాల్సిన పాలకులు 7ఏళ్ల నుంచి రాయితీపై విత్తనాలు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయడం లేదు. గార్ల మండలంలో సుమారు 6వేల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేస్తుంటారు. మండలంలో మిర్చి సుమారు 3000 ఎకరాల్లో, పత్తి 5000 ఎకరాల్లో, 400 ఎకరాల్లో మొక్కజొన్న, 550 ఎకరాల్లో పెసర, 1000 ఎకరాల్లో కంది పంటలు సాగు చేస్తుంటారు. ఖరీఫ్ సాగుకు ముందే వ్యవసాయ అధికారులు ప్రణాళికను రూపొందించి విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్‌ను పంపారు. అయినా వ్యవసాయ కార్యాలయానికి పత్తి, మిర్చి విత్తనాలు రాక పోవడంతో రైతులు ప్రైవేటు విత్తన డీలర్ల దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని గిరిజన రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ అధికారి స్పందించి వ్యవసాయ కార్యాలయం ద్వారా రైతులకు సరిపడా వరి, పత్తి, మిర్చి విత్తనాలు రాయితీపై అందేలా చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి రామారావును వివరణ కోరగా గతంలో మాదిరిగా ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులకు రాయితీపై పత్తి, మిరప విత్తనాలు రావడం లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో యంత్రలక్ష్మి పథకం ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.

రాయితీపై మిర్చి, పత్తి విత్తనాలు ఇవ్వాలి



వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ మండలాల్లోని గిరిజన రైతులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై మిర్చి, పత్తి విత్తనాలు సరఫరా చేసేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఐటీడీఏ ద్వారా రాయితీపై విత్తనాల సరఫరా నిలిచిపోయింది. దీంతో బయట మార్కెట్‌లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నాం.

– గుగులోత్ చిన్నఈర్యా, గ్యామాతండా

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి


కురవి: బడిబాటలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

కురవి/బయ్యారం/దోర్నకల్/గార్ల: పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని, నాణ్యమైన విద్య నందిద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల కేంద్రంతోపాటు కంచర్లగూడెం, రాజోలు, బలపాల తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా జీపుజాతను ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కుల కోసం పోరాటడమే కాకుండా బడి మనదే–బడి బాధ్యత మనదే అనే లక్ష్యంతో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫీజుల భారాన్ని తగ్గించి నాణ్యమైన విద్యను పొందేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, పి.మంజుల, .ప్రవీణ్‌కుమార్, లక్ష్మయ్య, బాబు, రమ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు, మహేష్, భిక్షపతి, తరుణ్, సీపీఎం నాయకులు గంధసిరి శ్రీనివాస్, కట్ల కృష్ణయ్య, రాజు పాల్గొన్నారు.

విద్యాసేవ చేయడం అభినందనీయం

- ఎమ్మెల్యే మురళీనాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: పేద విద్యార్థుల కోసం ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ విద్యా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలంలోని చీన్యాతండా జీపీలోని ప్రాథమిక పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదే విధంగా లైబ్రరీ కోసం పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్, డాక్టర్ గుమ్మడివెల్లి శ్రీనివాస్, రాజారాం, ఎస్సై మురళీధర్‌రాజు, రవికుమార్, మధు, బిందు, కొమ్ము రాజేందర్, సతీష్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శాస్త్రవేత్త మోహన్, జయకృష్ణ, నరేష్, మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

నెహ్రూసెంటర్: ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ డిమాండ్ చేశాడు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్‌లోకి ఇప్పటికే కల్తీ, నకిలీ ఎరువులు, విత్తనాలు వస్తున్నట్లు తెలుస్తుందని, వాటిని తక్షణమే అరికట్టాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండ ఐలయ్య, సహాయ కార్యదర్శులు జి.సత్రు, మైనం యాకయ్య పాల్గొన్నారు.

మోదీ పాలనలో పెరిగిన ఆర్థిక అసమానతలు



మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

చిన్నగూడూరు/దోర్నకల్: ప్రధాని మోదీ పాలనలో దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ మూడో మహాసభ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లు సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అదాని, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు దాసోహమై ప్రజల సంపదను దోచిపెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం మూడోసారి మండల కార్యదర్శిగా గంజి శేషాద్రిరెడ్డి, సహాయ కార్యదర్శిగా దొంతు స్టాలిన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామడుగు బ్రహ్మం, ఒగ్గుల వెంకన్న, కందుల వెంకన్న, పోలేపాక వెంకన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మహబూబాబాద్ రూరల్: గురువులతో పూర్వ విద్యార్థులు


తొర్రూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఒకరినొకరు కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, రామనర్సయ్య, నాగేందర్, పీఈటీ కొమరయ్య, శ్రీధర్‌రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, పాషా, శ్రీనివాస్ రెడ్డి, మాధవి, శ్రీదేవి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: తొర్రూరు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1995–96 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తరగతికి ఒక టీచర్ ఉండాలి

మరిపెడ రూరల్/మరిపెడ : ప్రాథమిక పాఠశాలలో ప్రతీ తరగతికి ఓ టీచర్ ఉండే విధంగా, 30 మంది విద్యార్థులకు కనీసం ముగ్గురు టీచర్లు ఉండే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీసర రమేష్‌రెడ్డి, లింగాల మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆదివారం వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు విద్యా వ్యవస్థను అయోమయానికి గురి చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్తర్వులను విరమించుకోవాలి

నెల్లికుదురు: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టులాంటిదని సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు మండల రాజు, ప్రధాన కార్యదర్శి మంచాల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

నెల్లికుదురు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అఖిల భారత ఐక్య రైతు డివిజన్ కార్యదర్శి జక్కుల యాకయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘం ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. కార్యమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐయూకేఎస్ మండల అధ్యక్షుడిగా దొడ్డ కేశవులు, ఉపాధ్యక్షుడిగా వెంకన్న, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఐలయ్య, రాంజీలను ఎన్నుకున్నారు.

రేపటినుంచి రెవెన్యూ సదస్సులు

కురవి: ఈనెల 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయ ఆదివారం తెలిపారు. 3న తిర్మలాపురం, మొగిలిచర్ల, జగ్యతండా, 4న తట్టుపల్లి, తావుర్య తండా, నారాయణపురం, కొత్తతండా, తేజావత్ తండా, పాతతండా, ధరావత్‌తండా, 5న నేరడ, బద్యతండా, బంగ్యాతండా, ఎల్కచెట్టుతండా, బద్రు తండా, మంచ్యాతండా, మేఘ్యతండా, చీమ్లాతండా, బాల్యతండా, చంద్రుతండా, సూదనపల్లి, బీబీనాయక్ తండా, జాటోత్ తండా, బోడతండా, మాలోత్ తండా, 6న మోద్గులగూడెం, బేగావత్‌తండా, సునార్ తండా, జుజూర్‌తండా, కందికొండ, బంజర తండా, లచ్చతండా, 9న నల్లెల్ల, గాజ తండా, టేకులతండా, సూర్యతండా, అయ్యగారిపల్లి, 10న కురవి, లింగ్యా తండా, బానోత్‌తండా, సోమ్లాతండా, ఇస్లావత్ తండా, తులిస్యాతండా, బోడతండా, కేశ్యాతండా, ఈర్యాతండా, కీమ్యాతండా, హుమ్లాతండా, బద్రుతండా, లచ్చిరాం తండా, బలపాల, లక్ష్మీ తండా, లింగ్యా తండా, 11న కంచర్లగూడెం, కంచర్లగూడెంతండా, గుండ్రాతిమడుగు(విలేజి), బంచరాయి తండా, బంగారిగూడెం, చౌళ్లతండా, కోవతండా, కొత్తూరు(జీ), పెద్ద తండా, పిల్లిగుండ్లతండా, తాట్యతండా, 12న రాజోలు బాలుతండా, హర్యతండా, పోలంపల్లితండా, బంధంకొమ్ము తండా, చింతల్ తండా, గుండ్రాతిమడుగు(స్టేషన్) గ్రామాల్లో రెవెన్యూ సదస్సులుంటాయని తెలిపారు.

సీరోలు మండలంలో...

ఈనెల 3, 4వ తేదీన సీరోలు, రేకులతండా, కొర్లకుంటతండా, 9న 10న, చింతపల్లి, కొత్తూరు(సీ), పెద్దలాల్ తండా, 11న, 12న తాళ్లసంకీస, వస్రాం తండా, బీల్యా తండా, 13, 14న ఉప్పరిగూడెం, గోపతండా, బూరుగు చెట్టు తండా, 16, 17న కాంపల్లి, కాంపల్లి తండా, బీల్యా నాయక్ తండాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని సీరోలు తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు.

గూడూరు: మండలంలో 3న భూపతిపేట, ఊట్ల, 4న అయోధ్యపురం, గోవిందాపురం, దుబ్బగూడెం, 5న బొద్దుగొండ, ఎర్రకుంటతండా, అప్పరాజీపల్లి, జగన్నాయకులగూడెం, జంగుతండా, 6న బొల్లెపల్లి, దామరవంచ, సకృతండా, 9న బ్రాహ్మణపల్లి, గూడూరు, లైన్‌తండా, మర్రిమిట్ట, ఏపూర్, లక్ష్మీపురం, పాటిమీదితండా, తీగలవేణి, 10న గాజులగట్టు, గుండెంగ, తేజావత్‌రాంసింగ్‌తండా, 11న మధనాపురం, మట్టెవాడ, శ్రీహనుమాన్‌తండ, 12న నాయకపల్లి, మచ్చెర్ల, 13న వెంగంపేట, ఆదివారంపేట, కొంగరగిద్ద, 16న సీతానగరం, రాజనపల్లి, 17న చిర్రకుంటతండా, పడమటితండా, పొనుగోడు, రాములుతండా, నేలవంచ, కొల్లాపురం, 18న తిమ్మాపురం రెవెన్యూ గ్రామాలలో రైతు వేదికలు, జీపీ కార్యాలయాలు, పాఠశాలల్లో జరుగుతాయని తహసీల్దార్ నాగభవాని తెలిపారు.

గార్ల: మండలంలో ఈనెల 3న చంద్రగిరి, సేరిపురం, బాలాజీతండాల్లో, 4న మద్దివంచ, కన్నాయిగూడెంలో, 5న రాంపురం, గోపాలపురం, పినిరెడ్డిగూడెం, 6న బుద్దారం, పుల్లూరు, చిన్నబంజర, 9న ముల్కనూరు, పెద్దకిష్టాపురం, బీఆర్ఎస్‌తండా, రాజుతండా, 10న చిన్నకిష్టాపురం, సత్యనారాయణపురం, గార్ల, మర్రిగూడెం, 11న సీతంపేట, 12న పోచారం, కోట్యానాయక్‌తండాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ శారద తెలిపారు.

బయ్యారం: మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ నెల 3 నుంచి 13 వరకు రోజుకు రెండు చొప్పున భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ తయారు చేశారు. సభలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగనున్నాయి.

తొర్రూరు రూరల్: మండలంలో రెవెన్యూ పరిధిలో 3న గోపాలగిరి, కొమ్మనపెల్లి, 4న చెర్లపాలెం, చింతలపల్లి, 5న కర్కాల, అమ్మాపురం, 6న చీకటాయాపాలెం, ఖానాపురం, 9న అరిపిరాల, సోమారం, 10న గుర్తూరు, పత్తేపురం, 11న బొంతుపల్లి, జమస్థాన్‌పురం, 12న మాటేడు, కంఠాయాపాలెం, 13న పోలెపల్లి, మడిపెల్లి, 16న వెంకటాపురం, తొర్రూరు, 17న నాంచారీమడూరు, వెలికట్ట గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

మరిపెడ రూరల్: మండలంలో 3న పురుషోత్తమాయగూడెం, బుర్హాన్‌పురం, 4న గుండెపుడి, గాలివారిగూడెం, 5న నీలికుర్తి, ఆనేపురం, 6న రాంపురం, ఉల్లెపల్లి, 9న తాళ్లఊకల్, బీచ్‌రాజుపల్లి, 10న తానంచర్ల, బాల్నిధర్మారం, 11న వీరారం, ఎడ్జెర్ల, 12న ఎల్లంపేట, గిరిపురం, 13న చిల్లంచర్ల, అబ్బాయిపాలెం ఆయా ఉమ్మడి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. అదేవిధంగా 14న మున్సిపాలిటీలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు.

నెల్లికుదురు: భూభారతి చట్టంతో రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను భూ సమస్యలున్న ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చందా నరేష్ ఆదివారం తెలిపారు. ఈనెల 3నుంచి 20వరకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రహదారిపై దుర్గంధం

బయ్యారం: మండలంలోని బయ్యారం–ఉప్పలపాడు రహదారిపై చోక్లాతండా వద్ద రహదారిపై నిలిచిన నీరు దుర్గంధం వెదజల్లుతుంది. రహదారి పక్కన ఉన్న భగీరథ పైపు లీకేజీతో వర్షంతో వస్తున్న నీరు నిల్వ ఉండడంతో ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యాలు తెచ్చే ప్రమాదం ఉందని ఇప్పటికైనా నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని తండావాసులు అధికారులను కోరుతున్నారు.


రహదారిపై నిలిచిన నీరు

సంక్షిప్త సమాచారం

ఉపాధి పనులు కల్పించాలి

మరిపెడ: మున్సిపాలిటీ కేంద్రాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుట్ల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మారగాని బాలకృష్ణ, ఉడుగుల లింగన్న, వేరేందర్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

మహబూబాబాద్ రూరల్: స్కంద షష్టి సందర్భంగా పట్టణంలోని నాగేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో గల సుబ్రహ్మణ్య స్వామివారి సన్నిధిలోఅర్చకులు ముడుంబై రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు.

సోలార్ లాంతర్ల పంపిణీ

గూడూరు: మండలంలోని మట్టెవాడ శివారు దొరవారితిమ్మాపురం గ్రామస్తులకు ఆదివారం బ్లూఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో సోలార్ లాంతర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు విస్సంపెల్లి క్రాంతికుమార్ మాట్లాడుతూ.. రూ. 30వేల విలువైన సోలార్ లాంతర్లు అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చుంచు శ్రీశైలం, వీరవెల్లి రవి, మధు, సుభాస్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

కరకట్ట పునరుద్ధరణ పనులు ప్రారంభం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని కలిమకుంట చెరువు కరకట్ట గత ఏడాది కురిన భారీ వర్షాలకు తెగిపోయింది. ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ కృషి ఫలితంగా కరకట్ట మరమ్మత్తులకు నిధులు మంజూరు అయ్యాయి. ఆదివారం చెరువు కరకట్ట పునరుద్ధరణ పనులను గ్రామస్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో యాదగిరి, కొమరయ్య, రాములు, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీ

గార్ల: మండలంలోని పీక్లీతండా గ్రామంలో గల అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ తాళంను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి హుండీలో గల సుమారు రూ.70వేల నగదును అపహరించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. విషయాన్ని స్థానిక పోలీసులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం రెవెన్యూ పరిధిలోని బాల్యతండా గ్రామ పంచాయతీలో బొడ్రాయి పండుగ తృతీయ వర్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు నూకల అభినవ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పానుగోతు రాంలాల్, విజయ్, కిషన్ శ్రీను పాల్గొన్నారు.

వనభోజనాలు

బయ్యారం: మండల కేంద్రంలోని ముస్తాఫానగర్ వాసులు ఆదివారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి సమీపంలోని పంటపొలాల వద్దకు వెళ్లిన ముస్తాఫానగర్‌వాసులు అక్కడే కుటుంబ సభ్యులతో కలిసి వంటావార్పు చేసుకున్నారు. అనంతరం అందరూ ఒకేచోట చేరి ఆటపాటలతో సందడి చేశారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

దోర్నకల్: మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. దోర్నకల్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటనారాయణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కలపల్లి ఇంద్రకుమార్(23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూకొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని రామగాని మాలకొండయ్య వ్యవసాయ బావి వద్ద ఇంద్రకుమార్ చీరెతో ఉరేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. ఆదివారం మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి

తొర్రూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన రాయిపెల్లి శివకుమార్ ఇంటర్‌లో 960 మార్కులు సాధించినందుకు వరంగల్ జిల్లా కేంద్రంలో గోపా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

లారీ ఢీకొని గేదెలు మృతి



కురవి: లారీ ఢీకొని నాలుగు గేదెలు మృతి చెందిన సంఘటన సీరోలు మండల కొత్తూరు(సీ) గ్రామంలోని గుజిలి తండా వద్ద 365 జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి నుంచి మరిపెడ వైపు వెళ్తున్న లారీ రోడ్డుపై నడిచి వెళ్తున్న గేదెలను ఢీకొట్టింది. ఈఘటనలో నాలుగు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో గేదెకు తీవ్రగాయాలు అయ్యాయి. కురవి మండలం మోద్గులగూడెం శివారు తండాకు చెందిన శ్రీరాం అనే రైతుకు చెందిన గేదెలుగా గుర్తించారు. లారీ యజమానితో మాట్లాడినట్లు సమాచారం. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైన ఘటనలో ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆరోగ్య రక్షణకు వైద్యశిబిరాలు దోహదం


పరీక్షలు చేసుకుంటున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు: ప్రజల ఆరోగ్య రక్షణకు వైద్య శిబిరాలు దోహదపడతాయని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో హనుమాండ్ల ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హనుమకొండ హజారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు శివ సుబ్రహ్మణ్యం, సత్యకిరణ్, సమర్ధరెడ్డి, వీరయ్య, నీరజ, మమత, యాదగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.